# సన్మానం

### ఎమ్. ఉమాలక్ష్మి



అంతవరకు రాత్రి ముసుగుతో నిద్రపోయిన చీకటి మెల్లమెల్లగా విచ్చుకుంటోంది. సూర్యకిరణాల కాంతితో ఎముకలు కొరికే చలిని తరమడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది లేలేత ఎండ. సూర్యుడి నులివెచ్చని కిరణాలు భూమి మీద పడుతుంటే, అప్పటివరకు ధారగా కురిసిన మంచు కరిగి, ఇగిరిపోసాగింది.

ఆ చలిలో ఆరుబయట చాపమీద కూర్చుని, వయొలిన్ వాయిస్తున్నాడు జగన్నాధం. వయొలిన్‌పై అతడి వ్రేళ్ల శృతిమించిన వేగంతో నాట్యం చేస్తున్నాయి. సుమధురమైన ఆ సంగీతానికి పులకించినట్లు, గులాబీలు, మందారాలు విచ్చుకుంటున్నాయి. పక్షులు కిలకిలారావాలతో తమ హర్షధ్వానాన్ని తెలుపుతున్నాయి.

అంతవరకు తనను తానే మైమరచి వాయించుకుంటున్న జగన్నాధం 'నాన్నా' అన్న పిలుపుతో ఉలిక్కిపడ్డాడు.

ఒక్కసారిగా అతని చేతిలో కమాన్ ఆగిపోయింది. నాట్యంచేస్తున్న ఆ చేతి వ్రేళ్ళు, సంకెళ్ళు వేసినట్టుగా ఆగిపోయాయి. అతడి హృదయం ఆవేదనతో బరువెక్కింది ఒక్క క్షణం.

గొంతు పెగల్చి ఏదో అనబోయాడు జగన్నాధం.

ఇంతలో "ఇంత ప్రొద్దున్నే అందరి నిద్రలు చెడగొట్టడానికి కాకపోతే, ఈ వేళప్పుడు ఆ సాధన ఏమిటి? తెల్లవారేసరికి వాయించవద్దని మీ కెన్నిసార్లు చెప్పాలి?" అని విసురుగా అక్కడినుండి వెళ్ళిపోయాడు.

జగన్నాధం గుండె ఒక్క క్షణం

బాధతో మెలికలు తిరిగిపోయింది. సంగీత జగత్తులో విహరిస్తూ ఆ సంగీతమే ప్రాణంగా బ్రతుకుతూ అందరిచేత మంచి విద్వాంసుడుగా కీర్తించబడుతున్న తన కడుపున, సంగీత రస మాధుర్యం తెలియని రసహీనుడు పుట్టాడని, అతడి మనసు పరితపించిపోయింది. అప్రయత్నంగా వాడి నిట్టూర్పు వెలువడింది.

"పార్వతీ. నాకెందుకీ శిక్ష మిగిల్చావు? నన్ను ఈ సంసారపు రొంపిలో దింపి, నువ్వు నిశ్చితంగా కళ్ళుమూశావు. నన్ను ఒంటరివాడిని చేసి వెళ్ళిపోవడం నీకు న్యాయమేనా? నువ్వు లేకుండా ఈ కటోడి ఎలా బ్రతకగలడనుకున్నావు? కన్నబిడ్డలు నన్ను కంటిపాపల్లాగ చూసుకుంటారనుకొని నువ్వు నిశ్చితంగా వెళ్ళిపోయావు. కానీ ఆ కన్నబిడ్డలే నా గుండెల్లో పొడిచేస్తున్నారు. నేను ఈ ఆవేదన భరించలేను. నీ దగ్గరకి వచ్చేస్తాను" మూగగా రోదించాడు జగన్నాథం, కనబడని పార్వతిని కళ్ళముందు ఊహించుకుంటూ?

జగన్నాథం మనసు పాతిక సంవత్సరాలు వెనక్కి మళ్ళింది.

జగన్నాథానికి అప్పుడు ముప్పై సంవత్సరాలు పైనే ఉంటాయి. పుట్టు గ్రుడ్డివాడైన జగన్నాథం తల్లిదండ్రులు అపురూపంగానే పెంచారు, జగన్నాథానికి సంగీతంలో ఎక్కువ శ్రద్ధ వుండడం గమనించి. అతనికి వయొలిన్ నేర్పించారు. ఒక్కగానొక్క బిడ్డ గ్రుడ్డివాడిగా పుట్టినందుకు తల్లిదండ్రులు నిత్యం కుమిలిపోతున్నా, జగన్నాథం వయొలిన్ వాయిద్యం విని కొంత ఉపశమించేవారు. జగన్నాథం వయొలిన్‌లో డిప్లొమా పొందేడు. కానీ ఆ వార్త వినే అదృష్టం లేకుండానే జగన్నాథం తండ్రి మరణించాడు.

జగన్నాథం ఇంటిప్రక్కనే రామారావు మాస్టరుగా రుండేవారు. ఆయనకి నలుగురూ ఆడపిల్లలే? పెద్దమ్మాయి పార్వతి కొంచెం నలుపు ఎక్కువ అవడంతో, ఎక్కువ కట్నం కోరేవారు. రామారావుకి అయిదారువేలు కన్న ఎక్కువ కట్నం ఇచ్చుకునే తాహతు లేదు. అందుకనే పార్వతి పాతిక సంవత్సరాలు పైబడినా అవివాహితగానే మిగిలిపోయింది. పార్వతికి పెళ్ళిచేస్తేగాని, పార్వతి చెల్లెళ్ళకి పెళ్ళికాదు.

పార్వతికి సంగీతమంటే ఎంతో ఇష్టం. కానీ పార్వతికి సంగీతం నేర్పించే తాహతు లేదు రామారావుకి. తను నేర్చుకోలేకపోయినా, జగన్నాథం వయొలిన్‌మీద కమాన్ వేస్తే చాలు, చేస్తున్నపని ఆపి జగన్నాథం దగ్గరకి వచ్చి, ఆ వయొలిన్ వాయిద్యాన్ని తన్మయంగా వినేది. జగన్నాథం పార్వతిల మధ్య స్నేహం పెనవేసుకుంది కొద్దిరోజుల్లోనే?

ఆ రోజు జగన్నాథం వయొలిన్ వాయిస్తున్నాడు. గంటసేపు వాయించినా

పార్వతి ఆ ఛాయలకు రాలేదు. కారణం తెలుసుకోవాలని జగన్నాథం మనసు తహతహలాడింది.

ఇంతలో రామారావుగారి ఇంట్లోంచి కేకలు వినబడడంతో అటువైపు వెళ్ళాడు జగన్నాథం.

"ఇక దీనికి జన్మలో పెళ్ళికాదండీ! ముదనష్టపు సంతానం" విసుగ్గా అంటోంది పార్వతి తల్లి.

"ఎందుకే దాన్నలా తిడతావు? పెళ్ళి కాకపోవడం అది చేసిన నేరమా! దానికి పెళ్ళి చెయ్యలేకపోయిన అసమర్థత మనది" రామారావు కంఠం ఖంగు మంటోంది.

"అసమర్థతేమిటండీ? అక్కడికీ ఎనిమిదివేలు ఇస్తామన్నాం. కాపీ వాళ్ళకి ఇది నచ్చలేదట! ఈ నల్లముండ ఇంటికి శనిలా దాపురించింది."

ఆ తర్వాత, చెళ్ళున కొట్టిన శబ్దం, చిన్నగా ఏడుపు వినబడ్డాయి.

"మళ్ళి మరొకసారి, దాన్ని నల్ల ముండ అంటే ఏంచేస్తానో చూడు." ఆవేశంగా అంటున్నాడు రామారావు.

"దీనికి పెళ్ళి కాకపోవడం, ఉన్న మాటంటే మీచేత దెబ్బలు తినడం నాకు అలవాటైపోయింది."

ఆ ఏడుస్తున్న గొంతు పార్వతి గొంతులా వుంది.

ఒక్కసారి వెళ్ళి పార్వతిని ఓదార్చా లనిపించింది. కానీ తను అక్కడికి వెళ్తే ఆమె మళ్ళీ ఏం గొడవ చేస్తుందోనని ఆ ప్రయత్నాన్ని తాత్కాలికంగా ఆపు చేశాడు జగన్నాథం.

ఆ రాత్రి పార్వతిగురించి ఆలోచిస్తూ డాబామీద నిద్రపోయాడు.

అతని పాదాలమీద చల్లని చేతులు పడడంతో ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"ఎవరూ .... ఎవరూ .... వచ్చింది పార్వతేనా!" అన్నాడు ఆమె అడుగుల సవ్వడి విని.

"ఊఁ" అంది పార్వతి నెమ్మదిగా.

"పార్వతీ! ఏమిటి ఈ సమయంలో ఇక్కడికి వచ్చావు. ఎవరైనా చూస్తే బాగుండదు."

"ఎన్నో రోజులుగా మిమ్మల్ని ఒక మాట అడగాలనుకుంటున్నాను."

"పార్వతీ! అందుకు ఇదా సమయం. దయచేసి ఇక్కడి నుండి త్వరగా వెళ్ళిపో!"

"మీరు వెళ్ళిపోమంటే ఇక్కడనుండే కాదు, ఈ లోకంనుండే శాశ్వతంగా వెళ్ళిపోతాను,"

"పార్వతీ!" ఆందోళనగా అన్నాడు జగన్నాథం.

"ఔనండీ! ఇక ఈ జన్మ వ్యర్థం. నా మూలంగా నా చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు ఆగిపోతున్నాయి. నన్ను పెళ్ళిచేసుకోవడానికి ఎవ్వరూ ముందుకి రావడంలేదు. జీవితాంతం మోడులా బ్రతికేకన్నా, ఈ



లోకంనుండి శాశ్వతంగా వెళ్ళిపోవడం తేలిక కదూ!" నిర్లిప్తత నిండిన గొంతుతో అంది.

"పార్వతీ! నువ్వా మాట అంటే భరించలేను."

"ఏమండీ! నాదొక కోరిక వుంది. అది మీరు తీరిస్తే తప్పకుండా బ్రతుకుతాను."

"నిన్ను బ్రతికించుకోవాలంటే, ఏం చెయ్యమన్నా చేస్తాను."

"ఐతే.... మీరు.... మీరు.... నన్ను పెళ్ళిచేసుకోవాలి."

"పార్వతీ! ఏమిటి .... ఏమిటి నువ్వంటున్నది!"

"నన్ను పెళ్ళిచేసుకోవడం మీకు ఇష్టంలేదా! పోనీలెండి. ఈ నల్లపిల్ల జీవితం ఇలా తెల్లవారిపోవలసిందే!" నిస్పృహగా అంది.

"అదికాదు పార్వతీ! నేను గ్రుడ్డివాడిని. నువ్వు నన్ను పెళ్ళిచేసుకుంటే సుఖపడలేవు. బాగా ఆలోచించుకో!"

"బాగా ఆలోచించుకునే ఈ నిర్ణయానికి వచ్చాను."

"ఈ గ్రుడ్డివాడిని వెన్నెల్లో నడిపిస్తానంటే కాదనగలనా! నీ ఇష్టం పార్వతీ... నీ ఇష్టం." అన్నాడు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ!

అతడి చేతులని కళ్ళకద్దుకుని "ఆ వరం చాలండీ!" అంది తృప్తిగా.

* * *

తెల్లగా దొరబాబులా వుండే జగన్నాథానికి, పార్వతికి అతి కొద్దికాలంలోనే పెళ్ళి జరిగిపోయింది. అప్పటినుండి పార్వతి జగన్నాథానికి అయిదోప్రాణం అయింది. ఆ తర్వాత జగన్నాథానికి సంగీత కాలేజీలో ఉద్యోగం వచ్చింది.

జగన్నాధానికి మంచి పేరు, డబ్బు రాసాగాయి. పార్వతి ప్రోద్బలంవల్లే ఎక్కువగా కచేరీలు చేసేవాడు. రేడియో ఆర్టిస్టు కాగలిగాడు.

జగన్నాధం, పార్వతిల దాంపత్య చిహ్నంగా రాజేష్ పుట్టాడు.

"ఏమండీ! రాజేష్ అచ్చం మీలాగే అందంగా వున్నాడండీ! నాలాగ నల్లగా పుట్టలేదు. వీడిని ఒక్కసారి చూడండి," అని సంతోషంతో పార్వతి చెపుతుంటే, జగన్నాధం నిశ్శబ్దంగా కన్నీళ్లు కార్చాడు.

అతడి కళ్ళల్లో కన్నీరు చూసి చలించి పోయి "పాపిష్ఠిదాన్ని మీ మనసు బాధ పెట్టాను. నన్ను క్షమించండి." అంది నొచ్చుకున్నట్లు.

"పార్వతీ! నువ్వన్న మాటలకు నేను బాధపడడంలేదు. కన్నబిడ్డని కళ్లారా చూసుకోలేని నా దురదృష్టానికి బాధపడు తున్నాను." అన్నాడు ఆవేదనగా!

ఆ తర్వాత పార్వతికి మరి సంతానం కలగలేదు.

రాజేష్ పెరిగి పెద్దవాడైనకొద్దీ సంగీతం అంటే విముఖత చూపేవాడు.

"పార్వతీ! ఈ విద్య నాతోనే అంత రించిపోవలసిందేనా! రాజేష్‌కి సంగీతం నేర్పుదామంటే, నా మాట వినడంలేదు." అనేవాడు జగన్నాధం ఆవేదనగా!

"ఎవరికెంత ప్రాప్తో అంతేనండి. ఆ సరస్వతీదేవి కృప వీడికి లేనట్లుంది. అందుకే సంగీతం వద్దంటున్నాడు. ఇప్పుడు మనం వాడికి బలవంతంగా చెప్పించినా, సంగీతం రాదుకదా, చదువు కూడా రాకుండా పోతుంది. పోనీ వాడిని అలా వదిలెయ్యండి. వాడికెప్పుడు జ్ఞానం వస్తే అప్పుడే నేర్చుకుంటాడు." అనేది.

రాజేష్ పెరుగుతున్నకొద్దీ జగన్నాధం సాధన తగ్గిపోసాగింది.

జగన్నాధం వయొలిన్ వాయిస్తే "నాన్నగారూ! ఆ వయొలిన్ కాస్త ఆపు తారా! నేను చదువుకొంటున్న చదువు బుర్రకెక్కడంలేదు." అనేవాడు.

అంతే జగన్నాధం వయొలిన్ మూగ పోయింది.

రాజేష్ స్కూలికి వెళ్ళిపోయినప్పుడు ఆ వయొలిన్ వాయించుకునేవాడు.

రాజేష్ ఉద్యోగస్తుడయ్యాడు.

పార్వతికి బ్లడ్‌కాన్సర్ అని తెలిసిన రోజు జగన్నాధానికి గుండె ఆగినంత పని అయ్యింది.

రోజురోజుకీ పార్వతి ఆరోగ్యం క్షీణిస్తోంది.

"ఏమండి రాజేష్ పెళ్ళి చూడకుండానే వెళ్ళిపోతానేమో! వాడికి పెళ్ళిచేసె య్యండి " అన్న పార్వతి మాట కాదన లేక, రాజేష్‌కి పెళ్ళి జరిపించాడు.

పార్వతి ఇంటిపనులు చెయ్యలేక మంచంపట్టింది.

కోడలు సునీత వచ్చినదగ్గరనుండి, రాజేష్ ప్రవర్తనలో మార్పు రాసాగింది.

ఇంటిపనంతా సునీత చెయ్యవలసి రావ డంతో, అత్తమామలమీద ఆమెకు చిరాకు అధికమయ్యింది. అయినదానికి కానిదానికి పార్వతిమీద విసుక్కో-సాగింది.

ఒకరోజు జగన్నాధం లోపలికివచ్చి, మంచినీళ్ళకుండ తడిమి, నీళ్ళు తీసుకో బోయి, తూలి పడిపోయాడు. కుండ బ్రద్దలైపోయింది.

"గ్రుడ్డిమేళమని గ్రుడ్డిమేళం. అసలు నీళ్ళు ఎవరు తీసుకోమన్నారు? అన్నిటికీ తగుదునమ్మా అని బయలుదేరుతారు. కళ్ళులేనివాళ్ళు ఒక మూల పడిఉండా లన్న జ్ఞానమైనా లేదు." అంది విసుగ్గా సునీత.

"సునీతా! అయన్ని ఎందుకలా కసురుకుంటావు? ఆయన నిన్ను మంచి నీళ్ళు అడిగి గంటసేపయ్యింది. నువ్వు ఇవ్వలేదు. నేను ఈ మంచం దిగిరాలేను. ఎందుకలా అయన్ని అన్ని మాటలని బాధపెడతావు!" అంది మంచంమీదనుండే పార్వతి.

"ఔను! నేనే మిమ్మల్ని బాధపెడు తున్నాను. రోగిష్టి అత్తకి, గుడ్డిమామకి సేవలు చెయ్యలేక చచ్చిపోతున్నాను. అయినా సరే నన్నే అంటారు. ఈ ఇంట్లో అందరికీ నేను అలుసైపోయాను."

"అమ్మా! సుజాతను ఎందుకే అలా అంటావు? ఇంటెడు చాకిరీ అది ఒకర్తే చేస్తుంది. దాన్ని ఇంకా సాధించాలా! రానురాను ఇల్లు నరకమైపోతుంది" అనె వాడు రాజేష్!

పార్వతి ఏమీ అనలేక మౌనంగా కన్నీరు కార్చేది.

ఆ తర్వాత కొద్దిరోజుల్లో నే పార్వతి మరణించింది.

అప్పటినుండి జగన్నాధం రెక్కలు తెగిన పక్షిలా అయిపోయాడు.

పార్వతి ఎప్పుడూ ఒక మాట అనేది, "ఏమండీ! మీరు ఇంత పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. మీ విద్యని గుర్తించి మీ కెవరైనా సన్మానం చేస్తే చూసి ఆనందించాలని ఉందండీ! నా ఆశ ఆ భగవంతుడు తీరుస్తాడో లేదో!" అనేది.

పార్వతి ఆశ, కోరిక ఫలించేరోజు వచ్చింది. కానీ.... కానీ.... రేప్రొద్దున్న తనకి జరగబోయే సన్మానం చూడడానికి పార్వతి లేదు.

అప్రయత్నంగా జగన్నాధం కళ్లు చెమ్మగిల్లాయి.

* * *

విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో జగన్నాధానికి సన్మానం జరగబోతుంది.

జగన్నాధం గురించి అతని విద్య గురించి అనర్గళంగా మాట్లాడారు ఆ కళా శాల ప్రిన్సిపాల్!

జగన్నాధం లాంటి అపూర్వ కళా

కారుడిని సన్మానించడం మన అదృష్టమని కొనియాడారు.

జగన్నాథాన్ని చెయ్యిపట్టుకొని వేదిక మీదకు తీసుకువచ్చి కుర్చీలో కూర్చో పెట్టారు.

అతడి శిరస్సుమీద పన్నీరు జల్లారు. భుజాలచుట్టూ శాలువా కప్పారు. మెడలో పెద్ద పూలహారం వేసారు,

జగన్నాథం కళ్లు సంతోషంతో చెమ్మ గిల్లాయి.

తన భుజాలమీదున్న శాలువా రెండు చేతులతో తడుముకున్నాడు. అతడికి చెప్పలేనంత ఆనందంగా వుందారోజు.

వెయ్యినూటపదహార్లు జగన్నాథానికి బహూకరించారు కరతాళ ధ్వనుల మధ్య.

జగన్నాథం వయొలిన్ వాయిద్యం వినడానికి అందరూ కుతూహల పడుతు న్నారు.

సన్మానకార్యక్రమం పూర్తికాగానే, వయొలిన్ పట్టుకొని స్టేజిమీద ఆశీను డయ్యాడు జగన్నాథం.

ఎంతో వుత్సాహంగా వయొలిన్ సోలో కచేరి పూర్తిచేసాడు.

కచేరీ పూర్తి అయ్యేసరికి కొందరు వచ్చి, జగన్నాథం పాదాలకి నమస్కా రించి వెళ్తున్నారు. సాక్షాత్తు సరస్వతీ పుత్రుడుగా అతడిని అభినందించి వెళ్ళి పోతున్నారు కొందరు.

ఇంతలో "నాన్న గారూ! రండి ఇంటికి వెళ్దాం," అన్న రాజేష్ పిలుపు వినబడి ఆశ్చర్యపోయాడు.

"రాజేష్! నువ్వు.... నువ్వు ఇక్క డికి వచ్చావా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీకు సన్మానం జరుగుతుంటే రాకుండా ఎలా వుండగలను!" అని జగ న్నాథం చెయ్యి పట్టుకొని బయటకు తీసుకువెళ్ళాడు.

రిక్షా ఇంటిముందు ఆగింది.

జగన్నాథాన్ని మెల్లగా రిక్షాలోంచి దింపి, చెయ్యిపట్టుకొని నడిపిస్తున్నాడు రాజేష్!

"మామయ్యగారూ! వచ్చేసారా! ఒక్కనిముషం అక్కడ నిల్చోండి కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు తెస్తాను!" అని అక్కడనుండి వెళ్ళింది సునీత!

లోపలనుండి చెంబుతో నీళ్ళుతెచ్చి జగన్నాథం కాళ్ళు కడిగింది.

"రండి మామయ్యా! ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. భోజనం చేద్దురు గాని." అంది సునీత.

కొడుకుకోడళ్ళ ప్రవర్తనకి ఆశ్చర్య పోయాడు జగన్నాథం.

"నా కాకలిగా లేదమ్మా! కాస్త మజ్జిగ ఇస్తే త్రాగి పడుకుంటాను." అన్నాడు జగన్నాథం.

జగన్నాథాన్ని మంచంమీద కూర్చో బెట్టాడు రాజేష్.

సునీత తెచ్చిన మజ్జిగ త్రాగి "బాబూ! రాజేష్ ఈ డబ్బు తీసి జాగ్రత్త పెట్టరా!"

అని జేబులో డబ్బు తీసి కొడుకుచేతి కిచ్చాడు.

వాటికోసమే ఎదురుచూస్తున్న రాజేష్ చప్పున ఆ డబ్బులు అందుకొని, జగన్నాథానికి శాలువా కప్పి అక్కడనుండి వెళ్ళిపోయాడు.

జగన్నాథానికి సన్నగా గుండెల్లో నొప్పి రాసాగింది. నిద్రపట్టక మంచం మీద అటూ, ఇటూ దొర్లుతున్నాడు.

కొడుకు గదిలోంచి మాటలు వినిపిస్తున్నాయి.

“ఏమండీ! ఆ ముసలాడు డబ్బు లిచ్చాడా!” ఆత్రంగా అడుగుతోంది సునీత!

“ఇవ్వక ఏంచేస్తాడు? మన ఇద్దరం ఎంత బాగా నటించాంగా? నిజంగా ప్రేమ అనుకున్నాడు పిచ్చితండ్రి” అన్నాడు రాజేష్.

“ఏమండీ! ఈ డబ్బుతో నాకొక పట్టుచీర కొనిపెట్టరూ!” ముద్దుగా అడుగుతోంది సునీత.

“ఓకె. మరి ఈ రాత్రంతా ఇలాగే మాటలతో కాలం గడుపుదామా!”

ఆ మాటలు వినడంతో జగన్నాథం గుండె తీవ్రంగా కొట్టుకోసాగింది. గుండెనొప్పి అధికమయ్యింది. భరించలేకపోతున్నాడు. మంచంమీద చేపపిల్లలా కొట్టుకుంటున్నాడు. తండ్రి పిలుపు కొడుకు చెవిని సోకలేదు.

‘పార్వతీ .. ఇక వీళ్ళమధ్య నేను బ్రతకలేను....నీ దగ్గరకే వచ్చేస్తున్నాను పార్వతీ! చూశావా నా కొడుకు, కోడలు ఈవేళ నాకెంత బాగా సన్మానం చేశారో! నాకు సన్మానం జరిగిందని సంతోషించాలా! వాడు ఇలా చేసాడని విచారించాలా! అందుకే.... అందుకే....నీ దగ్గరికి వచ్చేస్తున్నాను.” అతని హృదయం మూగగా రోదించింది.

క్రొత్త శాలువా ఒరిగిన భుజాలమీద నిర్జీవంగా వ్రేలాడుతోంది. తెల్లవారేసరికి జగన్నాథం ప్రాణం అనంతవాయువుల్లో లీనమయ్యింది.

